నేడు ఖేలో ఇండియా పోటీలకు ఎంపికలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, జనవరి 10: ఖేలో ఇండియా యూత్ వాలీబాల్ పోటీలకు గాను రాష్ట్ర జట్టు ఎంపికను గురువారం ఉదయం 9 గంటలకు విజయవాడలోని ఐజీఎంసీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-19 బాలురు మాత్రమే పాల్గొనాలని చెప్పారు. ఎంపికైన వారు తమిళనాడులో ఈ నెల 19 నుంచి 31వరకు జరగనున్న ఖేలో ఇండియా యూత్‌గేమ్స్‌లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు తమ ఆధార్‌కార్డు, పదో తరగతి సర్టిఫికెట్, వయసు ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని ఆయన కోరారు.



కవిటిలో కొబ్బరి తోట

- తుఫాన్లు, తెగుళ్లతో పంట నాశనం
- కాయలకు పెరగని ధరలు
- ఆదాయం లేక ఇబ్బందులు
- కుటుంబ పోషణకు అప్పులు
- ఇతర ప్రాంతాలకు వలసలు

కొబ్బరి రైతు కుదేలు

(కవిటి)

● కవిటి మండలం బల్లిపుట్టుగ గ్రామానికి చెందిన బి.జయమ్మకు ఐదు ఎకరాల వరి, కొబ్బరి పండించే భూమి ఉంది. అయితే కొబ్బరి పంటపై ఆదాయం అంతంత మాత్రంగానే ఉంటోంది. దీంతో ఆమె ఇద్దరు కుమారుల్లో పెద్దవాడు బతుకుతెరువు కోసం వలస వెళ్లాడు. చిన్న కొడుకు ప్రైవేట్‌గా పనిచేసుకొని తల్లిని చూసుకుంటున్నాడు. వ్యవసాయం ద్వారా వచ్చే ఆదాయం సాగు ఖర్చులకే చాలడం లేదని జయమ్మ వాపోతోంది.

ఒకప్పుడు ఉద్దానంలో ఎకరా కొబ్బరి తోట ఉంటే ఆ రైతు తన కుటుంబంతో దర్జాగా బతికేవాడు. ఇప్పుడు అప్పు చేస్తే తప్ప బతుకు సాగించలేని పరిస్థితి నెలకొంది. తుఫాన్లు, తెగుళ్లతో పంట దెబ్బతినగా.. ఆశించిన స్థాయిలో దిగుబడి రాక.. మరోవైపు గిట్టుబాటు ధర కరువవుతోంది. ఈ నేపథ్యంలో కొబ్బరి రైతులు కుటుంబాన్ని పోషించడానికి వేరే ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. ఉద్దానంలోని కవిటి, కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురం మండలాల్లో 32 వేల ఎకరాల్లో కొబ్బరి సాగు చేస్తున్నారు. కొబ్బరి తోటలు, ఉత్పత్తులపై ప్రత్యక్షంగా, పరోక్షంగా 2 లక్షల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. కొబ్బరిమొక్క నాటిన పదేళ్లకు కానీ పంట చేతికి అందదు. ఆ తరువాత రెండు నెలలకు ఒకసారి కొబ్బరి కాయలను దించి విక్రయిస్తుంటారు. ఆ వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించడం రైతులకు భారంగా మారింది. పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు అనుగుణంగా కొబ్బరికాయల ధరలు పెరగడంలేదు. ప్రస్తుతం వెయ్యి కాయలు రూ.14వేలు పలుకుతోంది. అది కూడా ఒడిశా నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తేనే. స్థానికంగా ఉన్న కంచిలి మార్కెట్‌లో వెయ్యి కాయలు రూ.10వేలు కూడా పలకడం లేదు. దీంతో అరకొర ఆదాయంతో నెట్టుకొస్తున్నారు. కుటుంబ పోషణ కోసం అప్పులు చేస్తున్నారు. మరోపక్క ఈ ప్రాంతంలో కిడ్నీ మహమ్మారి కబలిస్తోంది. అలాగే ఏటా ప్రకృతి వైపరీత్యాలతో ఉద్దానం రైతులు అతలాకుతలం అవుతున్నారు. వరుస తుఫాన్లతో పంట నాశనం కావడం, తెగుళ్ల తాకిడితో ఉన్న చెట్లను కాపాడుకోలేక ఆర్థికంగా నష్టపోతున్నారు. దీంతో కుటుంబ పోషణకు తప్పని పరిస్థితిలో బయట ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. కవిటి మండలం బల్లిపుట్టుగ గ్రామంలో మూడు వేల జనాభా ఉండగా ఇందులో 300 మంది హైదరాబాద్, విజయవాడ, చెన్నై తదితర ప్రాంతాలకు వలస వెళ్లారు. కవిటి మండలంలో ప్రతీ గ్రామం నుంచి 10 శాతం మంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. ప్రభుత్వాలు సైతం కొబ్బరికి సరైన మార్కెట్ కల్పించడం లేదని రైతులు వాపోతున్నారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొబ్బరి పరిశోధనా కేంద్రం ఏర్పాటు నేటికీ కార్యరూపం దాల్చలేదని పేర్కొంటున్నారు.

అప్పులే మిగులుతున్నాయి..



కొబ్బరి పంటపై ఆధారపడిన రైతు బతుకు నాశనమైపోతుంది. పంటకు తెగుళ్లు ఆశించడం, తుఫాన్లతో బతుకు దారుణంగా ఉంది. వ్యవసాయం చేస్తే అప్పులే మిగులుతున్నాయి. యువత వలస బాట పడుతున్నారు. రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు వెనుకడుగు వేస్తున్నాయి.

-బి.చిన్నబాబు, రైతు, బల్లిపుట్టుగ, కవిటి

కార్మికుల కొరత...



కొబ్బరి తోటల్లో పని చేసేందుకు యువకులు ముందుకు రావడం లేదు. కొబ్బరి చెట్టు ఎక్కి కాయలు దింపేందుకు కార్మికులు సాహసించడం లేదు. కార్మికుల కొరత తీవ్రంగా ఉంది.

-ఎం.జానకిరావు, కార్మికుడు

అంతర్ పంటలను ప్రోత్సహించాలి..



ఉద్దానం ప్రాంతంలో రైతులకు ఆదాయం వచ్చే అంతర్ పంటల సాగును అధికారులు ప్రోత్సహించాలి. టీడీపీ హయాంలో కొబ్బరి పార్కు ఏర్పాటుకు యత్నించా. ఈ తరుణంలో తితలీ తుఫాన్ రావడంతో పరిస్థితి మారింది. రైతులకు పూర్తిస్థాయిలో సహాయాన్ని అందించా. తెగుళ్ల నుంచి మొక్కలను రక్షించడం రైతులకు సవాల్‌గా మారింది. ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పించి ఉద్దానం రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

-బెందాళం అశోక్, ఎమ్మెల్యే, ఇచ్ఛాపురం



దూకలపాడు శివారులో మట్టి తవ్వకాలు చేపడుతున్న దృశ్యం

మట్టి దోపిడీ

- చెరువులు, ప్రభుత్వ స్థలాల్లో అక్రమ తవ్వకాలు
- ఇటుక బట్టీలు, రియల్ ఎస్టేట్‌కు తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి గండి

నరసన్నపేట, జనవరి 10: మండలంలో మట్టి, గ్రావెల్ మాఫియా రెచ్చిపోతుంది. ప్రభుత్వ స్థలాలు, చెరువుల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టి ఇటుకల బట్టీలు, రియల్ ఎస్టేట్ లేఅవుట్లకు తరలిస్తుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రావెల్, మట్టి తవ్వకాలు చేపట్టాలంటే మైనింగ్, రెవెన్యూ శాఖల నుంచి అనుమతి తీసుకోవాలి. క్యూబిక్ మీటర్ తవ్వకానికి రూ.150 నుంచి రూ.200 వరకు ప్రభుత్వానికి చెల్లించాలి. ఆ తరువాతే తవ్వకాలు చేపట్టాలి. కానీ, ఇవేమీ మండలంలో కనిపించడం లేదు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది. మండలంలోని జమ్ము, రావాడపేట, గడ్డెయ్యపేట, తామరాపల్లి, శివరాంపురం, దూకలపాడు, గొట్టిపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ స్థలాలు, చెరువుల్లో గ్రావెల్ తవ్వకాలు చేపట్టి రియల్ ఎస్టేట్ లేఅవుట్లకు తరలిస్తున్నారు. బాలసీమ, బసివలస, సుందరాపురం తదితర గ్రామాల్లో మట్టి తవ్వకాలు చేపట్టి సమీపంలోని ఇటుకల బట్టీలకు విక్రయిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వ అధీనంలో ఉన్న చెరువులు, రాళ్ల గుట్టలు, ఎర్రమట్టి దిబ్బలు రోజు రోజుకీ కరిగిపోతున్నాయి. గ్రామస్థాయిలో తమ కళ్ల ఎదుటే ఎక్స్‌కవేటర్లతో మట్టి, గ్రావెల్ తవ్వకాలు చేపట్టి తరలించుకుపోతున్నా సచివాలయ సిబ్బంది పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. జమ్ము, తామరాపల్లి నుంచి నరసన్నపేటకు ట్రాక్టరు గ్రావెల్ లోడు తరలించేందుకు రూ.800 వసూలు చేస్తున్నారు. అంత ధర ఎందుకంటే మైనింగ్ శాఖ, రెవెన్యూ శాఖకు డబ్బులు కడుతున్నామని అక్రమార్కులు చెబుతున్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన వేలాది రూపాయల సెస్‌కు ఎగనామం పెడుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ సింహాచలం వివరణ కోరగా.. 'అనుమతి లేకుండా తవ్వకాలు చేయరాదు. మైనింగ్ అధికారులకు పట్టుబడితే అపరాధ రుసుం వసూలు చేస్తారు. అక్రమంగా తవ్వకాలు జరిగినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటా'మని తెలిపారు.

టాస్క్ పేరుతో సైబర్ మోసం

- రూ.16 లక్షలు వసూలు చేసిన కేటుగాళ్లు
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

శ్రీకాకుళం క్రైం, జనవరి 10: ఆమదాలవలస మండలంలో ఓ వ్యక్తి సైబర్ మోసానికి గురయ్యాడు. సైబర్ కేటుగాళ్ల మాటలు నమ్మి రూ.16 లక్షల పోగొట్టుకున్నాడు. దీనిపై బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఆమదాలవలస మండలానికి చెందిన ఓ వ్యక్తి గతంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం నిర్వహించి ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగానికి సిద్ధమవుతున్నాడు. ఈక్రమంలో గత నెల 30న తన వాట్సాప్ నెంబర్ నుంచి 249110268477 అనే నెంబర్‌కి ఆన్‌లైన్ టాస్క్ కోసం సంప్రదించాడు. దీంతో టాస్క్ ఇచ్చిన వ్యక్తి యూట్యూబ్‌లో వీడియోలు లైక్ చేస్తే రూ.15 పంపిస్తామని చెప్పి పరిచయం చేసుకున్నాడు. దీంతో యూట్యూబ్ వీడియోలను నాలుగు సార్లు లైక్ చేయడంతో అతని ఫోన్‌పే నెంబర్‌కు రూ.150 పంపించారు. అలా కొంచెం కొంచెంగా టాస్క్ లావాదేవీలు రూ.వేలు, రూ.లక్షల్లో జరిగాయి. రూ.2లక్షలు చెల్లిస్తే ఇప్పటి వరకు లభించిన మొత్తాన్ని వాడుకోవచ్చని, టాస్క్ లెవిల్ పెరుగుతుందని కేటుగాళ్లు చెప్పడంతో సదరు వ్యక్తి నమ్మాడు. దీంతో ఈ నెల ఒకటో తేదీన రూ.2లక్షలు బ్యాంకు ఖాతాద్వారా చెల్లించాడు. అయితే టాస్క్‌లో ఓ వ్యక్తి తప్పుగా ఆర్డర్ చేశాడని, దీంతో అందరి డబ్బులు పోయాయని, తక్షణం రూ.6లక్షలు కడితే ప్రాఫిట్‌తో రూ.12 లక్షలు తీసుకోవచ్చని నమ్మించారు. దీంతో ఈ నెల 3న రూ.6లక్షలు చెల్లించాడు. అలాగే, నేషనల్ ట్యాక్స్ రూ.3,64,053 చెల్లించాలనడంతో ఆ మొత్తాన్ని కూడా చెల్లించాడు. అయితే రిమార్క్స్‌లో ట్యాక్స్ అని పెట్టలేదని, మరో రూ.3,64,053 చెల్లించాలని చెప్పడంతో మరోసారి ఆ మొత్తాన్ని చెల్లించాడు. ఆ తరువాత క్రెడిట్ పాయింట్లు తగ్గాయని, మరో రూ.2లక్షలు చెల్లించి పాయింట్లు పెంచుకోవాలని కేటుగాళ్లు చెప్పడంతో తాను మోసపోయానని ఆ వ్యక్తి గుర్తించాడు. దీంతో ఆమదాలవలస పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ వై.కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువత సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనవసరమైన ఆన్‌లైన్ లింక్‌లను ఓపెన్ చేయవద్దని సూచించారు.

సంక్రాంతి కోడి పందేలు

- వంశధార తీరంలో నిర్వహణకు ముమ్మర ఏర్పాట్లు
- పోలీసుల హెచ్చరికలు పట్టించుకోని నిర్వాహకులు

నరసన్నపేట, జనవరి 10: సంక్రాంతికి కోడి పందేల నిర్వహణకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. లుకలాం- కామేశ్వరిపేట వద్ద వంశధార నదీ తీరంలో రైల్వేవంతెనకు సమీపంలో బరులు సిద్ధమవుతున్నాయి. పోలీసులు హెచ్చరిస్తున్నా నిర్వాహకులు మాత్రం కోడి పందేలకు సిద్ధమవుతున్నారు. భోగి నుంచి ముక్కనుమ వరకు మూడు రోజుల పాటు పందేలు నిర్వహించేందుకు బరులు సిద్ధం చేస్తున్నారు. లుకలాం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ప్రతి ఏటా సంక్రాంతి సమయంలో కోడి పందేళ్లు నిర్వహిస్తుంటారు. నరసన్నపేట, జలుమూరు, ఆమదాలవలస మండలాల నుంచి పందేంరాయుళ్లు హాజరవుతుంటారు. మూడు రోజుల క్రితం లుకలాం, ముషిడిగట్టు, గొట్టిపల్లి, జమ్ము, కరగాం, కంబకాయి శివారు ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహించారు. ఈ విషయంపై ఎస్ఐ సింహాచలం మాట్లాడుతూ.. 'ఇప్పటికే పందేంరాయుళ్లను హెచ్చరించాం. కొందరిపై బైండోవర్ కేసులు నమోదు చేశాం. కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం'. అని తెలిపారు.



ఇటీవల కంబకాయి- జమ్ము గ్రామాల మధ్య పొలాల్లో కోడిపందేలు

అదేజోరు.. ఆగని పోరు

- జిల్లాలో కొనసాగుతున్న అంగన్‌వాడీ, ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసనలు
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



జగనన్నా నీకో దండం అంటూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

(అరసవల్లి, జనవరి 10)

జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసనలు కొనసాగుతున్నాయి. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వేర్వేరుగా ఆందోళనలు చేపడుతున్నారు. వినూత్న పద్ధతుల్లో నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ బెదిరింపులకు భయపడేది లేదని, తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేస్తున్నారు.

జగనన్నా నీకో దండం

ఎస్మాకు అంగన్‌వాడీలు భయపడేది లేదని, వారి న్యాయ మైన కోర్కెలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యవర్గస భ్యుడు బి.కృష్ణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ సమీపంలోని జ్యోతిబాపూలే పార్కువద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మోకాళ్లపై కూర్చుని చేతులెత్తి జగనన్నా నీకో దండం అని నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం దారుణమన్నారు. గత 30 రోజులుగా శాంతియుతంగా సమ్మె చేస్తున్నా నోటీసులు ఇవ్వడం, ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడడం మానుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. లేదంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.కళ్యాణి, నాయకులు డి.సుదర్శనం, బి.ఆదిలక్ష్మి, టి.రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

విభజించు పాలించు సరికాదు

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సమగ్రశిక్ష అభియాన్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు పైడి.మురళీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ సమీపంలోని జ్యోతిబాపూలే పార్కు వద్ద 22వ రోజు బుధవారం సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని వర్గాలకు జీతాలు పెంచి, కొన్ని వర్గాలకు పెంచకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. విభజించు పాలించు పద్ధతిలో ఉద్యోగుల మధ్య విభేదాలు సృష్టించడం సరికాదన్నారు. పాదయాత్రలో సీఎం జగన్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఉద్యోగులందరికీ హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి తవిటినాయుడు, కోశాధికారి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

శ్రీకాకుళంలో చోరీ

- 9 తులాల బంగారు ఆభరణాల అపహరణ
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు

శ్రీకాకుళం క్రైం, జనవరి 10: సంక్రాంతి సెలవులకు కుటుంబంతో కలిసి ఊరెళ్లిన ఓ మహిళ ఇంట్లో దొంగలు పడి సుమారు 9 తులాల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయిన ఘటన శ్రీకాకుళం నగరంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలవీధిలో గొర్లె రమాదేవి తన ఇద్దరి పిల్లలతో నివసిస్తుంది. ఈమె భర్త భాస్కరరావు సీఆర్‌పీఎఫ్‌లో విధులు నిర్వహిస్తున్నారు. పిల్లలకు సంక్రాంతి సెలవుల ఇవ్వడంతో రమాదేవి మంగళవారం మధ్యాహ్నం పిల్లలతో కలిసి స్వగ్రామం సరుబుజ్జిలి వెళ్లారు. అయితే బుధవారం ఉదయం రమాదేవి ఇంటికి పాలు ఇచ్చేందుకు పాల వాడు వెళ్లాడు. అప్పటికే రమాదేవి ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో యజమానికి సమాచారం ఇచ్చాడు. దీంతో రమాదేవికి ఇంటి యజమాని ఫోన్లో సమాచారం అందించారు. ఆమె ఇంటికి చేరుకుని దొంగతనంపై వన్ టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ వై.శృతి, సీఐ ఆర్.సన్యాసినాయుడు, ఎస్ఐ బలివాడ గణేష్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, క్లూస్ టీమ్ వచ్చి ఆధారాలు సేకరించింది. బీరువాలో ఉన్న సుమారు 9 తులాల బంగారు ఆభరణాలు పోయినట్టు రమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

మృత్యువులోనూ వీడని బంధం

- నూర్పిడి యంత్రం మీద పడి దంపతుల దుర్మరణం
- బిన్నలమదనాపురంలో విషాదం

మందస, జనవరి 10: గ్రామంలో ఏ పని ఉన్నా ఆ దంపతులు కలిసే వెళ్తారు. వారిద్దరూ కూలికెళ్తేనే ఆ కుటుంబం పూట గడుస్తుంది. అయితే, వారిపై మృత్యువు పగబట్టింది. నూర్పు యంత్రం రూపంలో కబళించింది. పొలం గట్టుపై కూర్చున్న వారిపై యంత్రం తిరగబడడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన మందస మండలం బిన్నలమదనాపురం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్థుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మార్పు భుజంగరావు(61), భానుమతి (52) దంపతులు. వీరికి కుమారుడు ప్రసాద్, కుమార్తె లావణ్య ఉన్నారు. లావణ్యకు వివాహమైంది. భుజంగ రావు, భానుమతి నిత్యం గ్రామంలోని వ్యవసాయ పనులకు వెళ్తుంటారు. ప్రస్తుతం వరి నూర్పులు జరుగుతుండడంతో గ్రామంలోని మార్పు మాధవరావుకు చెందిన నూర్పిడి యంత్రానికి కూలీలుగా వెళ్తున్నారు. బుధవారం ఉదయం గ్రామంలోని పలువురి రైతుల వరి చేలను పొలాల్లో నూర్పు చేశారు. సాయంత్రం 4 గంటలకు మరో రైతుకు చెందిన పొలంలో నూర్పు చేసేందుకు యంత్రంతో బయలుదేరారు. అయితే, డ్రైవర్ యంత్రాన్ని గట్టు దాటిస్తున్న సమయంలో అదుపుతప్పి పక్కనే పొలం గట్టుపై కూర్చున్న భుజంగరావు, భానుమతిపై బోల్తాపడింది. వెంటనే గ్రామస్థులు పరుగున వచ్చి యంత్రాన్ని పైకి లేపారు. అప్పటికే యంత్రం కింద నలిగి భుజంగరావు, భానుమతి మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం హరిపురం సీహెచ్‌సీకి తరలించారు. మందస ఎస్ఐ బి.అనిల్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



భుజంగరావు, భానుమతి మృతదేహాలు

'రా.. కదలిరా'లో టీడీపీ జిల్లా నేతలు

శ్రీకాకుళం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి గుండ లక్ష్మీదేవి కలిశారు. బుధవారం బొబ్బిలిలో జరిగిన రా.. కదిలి రా కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబును మర్యాద పూర్వకంగా ఆమె కలుసుకుని నియోజకవర్గ పరిస్థితులను వివరించారు.

● ఎచ్చెర్ల: విజయనగరం జిల్లా బొబ్బిలిలో బుధవారం నిర్వహించిన రా.. కదలిరా కార్యక్రమంలో ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేతలు, కార్యకర్తలు తరలివెళ్లారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబును పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు, తదితరులు కలుసుకున్నారు.

● జి.సిగడాం: బొబ్బిలిలో బుధవారం నిర్వహించిన రా..కదలిరా టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు బహిరంగ సభకు మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకటరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు పిలుపు మేరకు మండల నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు కుమరాపు రవికుమార్, టి.మౌళీశ్వరావు, కూనిబిల్లి కూర్మారావు, కుదిరెళ్ల బుజ్జి, ఆరెళ్ల గొల్లాజి, బోగాది అప్పలనాయుడు, నక్క మురళీ, విక్రం కాశి, పడాల అప్పన్న, భూపతి శ్రీరామూర్తి, బెవర జగన్నాధరావు, కామోజుల సీతారాం తదితరులున్నారు.

● పొందూరు: టీడీపీ అధినేత చంద్రబాబు విజయనగరం జిల్లా బొబ్బిలిలో చేపట్టిన రా.. కదలి రా సభకు మండలం నుంచి భారీగా టీడీపీ నాయకులు తరలివెళ్లారు. మండల టీడీపీ అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, ఏఎంసీ మాజీ చైర్మన్ అన్నెపు రాము, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కర్, పొందూరు పట్టణ పార్టీ అధ్యక్షుడు అనకాపల్లి చినరంగ, దుప్పల గణపతి తదితరులు పాల్గొన్నారు. తొలుత టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


చంద్రబాబుతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి


జి.సిగడాం: సభకు బయలుదేరిన మండల టీడీపీ నాయకులతో కళా వెంకటరావు తదిరతులు


పొందూరు: ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ నాయకులు..


ఎచ్చెర్ల: చంద్రబాబును కలిసిన రామ్‌మల్లిక్‌నాయుడు

బైక్‌ను ఢీకొన్న ట్రాక్టర్

సంతబొమ్మాళి: పాలతలగాంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌బీ కొత్తూరుకు చెందిన వంకల నవీన్, సార శ్రీను బోరుభద్ర నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా పాలతలగాం వద్ద పొలం నుంచి రోడ్డు ఎక్కుతున్న ట్రాక్టర్ ఢీ కొనడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. వీరిలో నవీన్‌కు తీవ్రంగా గాయాలు కావడంతో శ్రీకాకుళం, శ్రీనును నరసన్నపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ మధుసూదనరావు పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

కోటబొమ్మాళి: జాతీయ రహదారిపై జర్జంగి ఫ్లైఓవర్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నరసన్నపేట గ్రామానికి చెందిన వి.ప్రవీణ్ గాయపడ్డాడు. ప్రవీణ్ ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో నరసన్నపేట నుంచి టెక్కలి వైపు వెళ్తుండగా జర్జంగి దాటిన తర్వాత బైక్ అదుపుతప్పి రోడ్డుకు పక్కన ఉన్న స్తంభాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ప్రవీణ్ ఎడమకాలు విరిగిపోయింది. 108 వాహనంలో కోటబొమ్మాళి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు ఎస్ఐ షేక్‌మహ్మద్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని వ్యక్తికి..

వజ్రపుకొత్తూరు: బెండిగేటు జంక్షన్ వద్ద బుధవారం రాత్రి టాటాఏస్ వాహనం ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని 108 వాహనంలో పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అతని పేరు రోణంకి తిరుపతిరావుగా సమాచారం. క్షతగాత్రుడు అపస్మారక స్థితిలో ఉన్నందున ప్రమాదంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

వృద్ధురాలి మెడలోని గొలుసు చోరీ

హిరమండలం: స్థానిక బ్యారేజీ సెంటర్‌లో బుధవారం మధ్యాహ్నం ఇద్దరు వ్యక్తులు వృద్ధురాలి మెడలో బంగారు గొలుసును చోరీకి పాల్పడ్డారు. ఎస్ఐ నారాయణస్వామి తెలిపిన వివరాల మేరకు.. భామిని మండలానికి చెందిన కర్రి అమ్మన్న తన కుమార్తెను సంక్రాంతికి పిలుపు చేసేందుకు కొరసవాడ వెళ్లి తిరుగు ప్రయాణంలో హిరమండలం బ్యారేజీ సెంటర్‌లో ఆటో దిగింది. స్వగ్రామం వెళ్లేదుకు బస్సు కోసం వేచి ఉండి.. బహిర్భూమి కోసం అమృత హోటల్ వెనుక వైపునకు వెళ్లింది. అక్కడ కళ్లు తిరిగి స్పృహ తప్పి పడిపోయింది. దీనిని గమనించిన ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలో ఉన్న ఆరున్నర తులాల బంగారు గొలుసును దొంగిలించారు. అమ్మన్నకు స్పృహవచ్చి చూసే సరికి మెడలో గొలుసు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ ఘటనా స్థలాన్ని పరిశీంచారు. హోటల్ వద్ద ఉన్న సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించి చోరీకి పాల్పడిన వారు హిరమండలం మోణింగి వీధికి చెందిన ఇంటి వెనుకాల సురేష్, చింతాడ మాధవ్‌గా గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

నిజాయితీ చాటుకున్న ఉపాధ్యాయుడు


పర్సు అప్పగిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైం: నగరంలోని ఏడురోడ్ల కూడలిలో పొందూరు మండలం నందివాడ గ్రామానికి చెందిన పిస్నింటి లక్ష్మి తన పర్సు పోగొట్టుకుంది. అయితే ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న వి.శ్రీనివాసరావుకి బుధవారం ఆ పర్సు దొరికింది. దీంతో ఆయన టూటౌన్ పోలీసులను కలిసి ఆ పర్సు అప్పగించారు. అయితే పర్సు పోగొట్టుకున్న లక్ష్మి రెండో పట్టణ పోలీసులను ఆశ్రయించడంతో ఎస్ఐ లక్ష్మణరావు ఆ పర్సును అప్పగించారు. ఈ పర్సులో అర తులం బంగారు చెవి రింగులతోపాటు వెండి ఉంగరం, రూ.2,430 నగదు ఉన్నాయి. ఉపాధ్యాయుడుగా అందరికి స్ఫూర్తినిస్తూ నిజాయితీ చాటుకున్న శ్రీనివాసరావును పోలీసులు అభినందించారు.

బెల్లుకోలలో ధాన్యం బస్తాలు దగ్ధం

నందిగాం: రధజనబొడ్డపాడు పంచాయతీ బెల్లుకోలలో మంగళవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమా దంలో 35 ధాన్యం బస్తాలు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామానికి చెందిన దాసుపురం పట్టయ్య కౌలుకు తీసుకొని సాగుచేసిన పంటను నూర్పిడి చేసి కల్లంలో ధాన్యం బస్తాలు ఉంచగా ఈ ప్రమాదం జరి గింది. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. టెక్కలి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఆర్ఐ పి.కిరణ్ నష్టంపై ఆరా తీశారు. బాధిత రైతును ఆదుకోవాలని స్థానిక గ్రామపెద్ద బొడ్డపాటి తిరుపతిరావు కోరారు.

పట్టుబడిన జేబుదొంగ

శ్రీకాకుళం క్రైం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ పరిసరాల్లో ఇటీవల జరిగిన జేబు దొంగతనాల ఘటనలో ఒక వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులకు పట్టుకున్నారు. ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపిన వివరాల మేరకు.. ఆదిత్యుని దర్శించుకునేందుకు వచ్చే భక్తులను టార్గెట్ చేస్తూ, రద్దీగా ఉన్న సమయంలో ఆమదాలవలసకు చెందిన పూజారి శ్రీను అనే వ్యక్తి భక్తుల జేబులోని పర్సులు, ఫోన్లు దొంగతనం చేస్తుంటాడని తెలిపారు. ఇటీవల జరిగిన పర్సు దొంగతనంలో ఆలయంలో ఉన్న సీసీ ఫుటేజీల ఆధారంగా దొంగతనానికి పాల్పడింది శ్రీనుగా గుర్తించి బుధవారం పట్టుకున్నట్టు తెలిపారు. ఈ మేరకు అరసవల్లిలోని ఆలయ ఉద్యోగులను కూడా ఎస్ఐ గణేష్ విచారించారు.

ఆదిత్యాలయంలో మహాలింగార్చన



అరసవల్లి: ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్య నారాయణ స్వామివారి ఆలయ అనివెట్టి మండపంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో బుధవారం ఆలయ వేదపండితులు, అర్చకులు శివ పంచాయతన సహిత మహాలింగార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో హరిసూర్యప్రకాష్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

చివరకు న్యాయమే గెలిచింది

● టీడీపీ నాయకుడు గొండు శంకర్


మాట్లాడుతున్న గొండు శంకర్

అరసవల్లి: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుపై ఎన్ని కుట్రలు, కుతంత్రాలు జరిగినా చివరకు న్యాయమే గెలిచిందని టీడీపీ నాయకుడు, ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొండు శంకర్ హర్షం వ్యక్తం చేశారు. మూడు కేసుల్లో చంద్రబాబుకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేయడంపై టీడీపీ శ్రేణులు, కార్యకర్తలు, ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీకి ఇది శుభపరిణామమని, రాష్ట్రానికి మంచిరోజులు రానున్నాయని అన్నారు. రానున్న ఎన్నికలకు తెరిచిన పుస్తకం వలే చంద్రబాబు ప్రజల ముందుకు రాబోతున్నారని, గెలిచి టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.

'దగా చేసిన జగన్‌ను ఓడిద్దాం'


సమావేశంలో పాల్గొన్న నాయకులు

శ్రీకాకుళం క్రైం: దళిత ప్రజా సంఘాలు పోరాట ఫలితంగా సాధించుకున్న 28 పథకాలను అమలు చేయకుండా నిలుపుదల చేసిన జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో ఓడించాలని దళిత సంఘాలు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక అంబేడ్కర్ విజ్ఞాన్ మందిరంలో బుధవారం దళిత సంఘాలు, వివిధ రాజకీయ పార్టీ నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వైసీపీ అధికారంలోకి వచ్చాక దళిత, ఆదివాసీల అభివృద్ధి నిర్వీర్యం అయిందన్నారు. సమావేశంలో టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్ట పురుషోత్తం, జనసేన పార్టీ ఆమదాలవలస ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్, దళిత సంఘాల నాయకులు బాలకృష్ణ, రామారావు, ఈశ్వరరావు రమణ, బలగ గణపతి తదితరులు పాల్గొన్నారు.

అసమానతలు లేని సమాజానికి దోహదపడాలి

అరసవల్లి: అసమానతలు లేని సమాజం కోసం విద్యారంగం దోహదపడాలని, అటువంటి విద్యకోసం సాగే ఉద్యమాలను బలోపేతం చేయడానికి ఉపాధ్యాయ లోకం నడుం కట్టాలని విద్యావేత్త కేఎస్ చలం అన్నారు. బుధవారం నగరంలోని శాంతినగర్ కాలనీలోని కళింగ భవన్‌లో ఏపీటీఎఫ్ రాష్ట్రకమిటీ నిర్వహించిన మార్పు బాలకృష్ణమ్మ స్మారక సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. 77 ఏళ్ల ఏపీటీఎఫ్ ఉద్యమ చరిత్రలో మార్పు బాలకృష్ణమ్మ పాత్ర మహోన్నతమైనదని, ఆయన అమరజీవి అని కొనియాడారు. తొలుత మార్పు బాలకృష్ణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు మాట్లాడుతూ.. ఫెడరేషన్ ఆశయాలకు తన తుది శ్వాస వరకు ముందుకు తీసుకువెళ్లిన ధీరుడిగా మార్పు చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ సీనియర్ నాయకుడు, ఐఫియా జాతీయ కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ ఫెడరేషన్ ఉద్యమగీతాన్ని, మార్పు స్మృతి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి, ఐఫియా జాతీయ నాయకులు కె.సుబ్బారెడ్డి, గౌరవాధ్యక్షుడు ఎ.సదాశివరావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు చింతాడ దిలీప్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు వాన కామేశ్వరరావు, టి.చలపతిరావు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు


మాట్లాడుతున్న ఎన్ఈఆర్

జి.సిగడాం: అర్హులైన ప్రతీ ఒక్కరికి పథకాలు అందించటమే కేంద్రప్రభుత్వ ధ్యేయమని విజయనగరం జిల్లా బీజేపీ అధ్యక్షుడు నడుకుదిటి ఈశ్వరరావు(ఎన్ఈఆర్) అన్నారు. బుధవారం వాంద్రంగిలో వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు, విశ్వకర్మ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వజ్జపర్తి రఘురాం, మండల ప్రధాన కార్యదర్శి మీసాల రామకృష్ణ, సర్పంచ్ సాకేటి నాగరాజు, మాజీ సర్పంచ్ బూరాడ వెంకటరమణ, ఎంపీడీవో కె.నిశ్చల, ఏపీవో సత్యనారాయణ, ఎంఈవో అరసాడ రవి తదితరులు పాల్గొన్నారు.

అమలు చేయని జీవో ఎందుకు?


మాట్లాడుతున్న మాజీ మంత్రి గుండ

అరసవల్లి: ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ విషయంలో రెవెన్యూమంత్రి ధర్మాన ప్రసాదరావు చట్టం అమలుకు ఎటువంటి చర్యలు తీసుకోమని చెప్పినప్పుడు ఎందుకు ఆ జీవో విడుదల చేశారని మాజీమంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు గుండ అప్పల సూర్యనారాయణ ప్రశ్నించారు. బుధవారం తన స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎటువంటి ఆలోచన లేకుండా జీవోలు తావడం, ఆ తర్వాత ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఈ ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని ఎద్దేవా చేశారు. ఈ చట్టంపై న్యాయవాదులు కోర్టుకు వెళ్లారని, హైకోర్టు కూడా సివిల్ కోర్టులో విచారణ కొనసాగించాలని చెప్పిందని, దీనిని బట్టి ఇది వివాదాస్పదమైన చట్టమని రుజువవుతోందని అన్నారు. భూ హక్కులను కోర్టుల ద్వారా సహజ న్యాయం లభిస్తుందన్నారు. అందువల్ల ఈ జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

బిల్లుల చెల్లింపుల్లో జాప్యం సరికాదు


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గార: మండలంలో గత నెల 10వ తేదీ నుంచి ధాన్యం కొనుగోలు ప్రారంభించిన అధికారులు బిల్లులు చెల్లింపులో తీవ్ర జాప్యం చేస్తుండడం దారుణమని టీడీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కుమ్మరిపేటలో మండల టీడీపీ నాయకులు జల్లు రాజీవ్ తదితరులు విలేకరులతో మాట్లాడారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. ధాన్యం కొలుగోలు ప్రారంభించి నెల గడుస్తున్నా బిల్లులు చెల్లించకపోవడంతో రైతులు సంక్రాంతి పండుగ ఎలా చేసుకుంటారన్నారు. తక్షణమే ధాన్యం బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీడీపీ నాయకులు పి.కృష్ణ రెడ్డి, రాధాకృష్ణ రెడ్డి, మళ్ల నర్సింగరావు, ఎన్ని గోవిందరావు, కొర్రాయి గోపి, బోర నాగరాజు తదిరుతులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిరసన


నిరసన తెలుపుతున్న బెంతు ఒరియాలు

కవిటి: ఎస్టీ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని బెంతు ఒరియా కులస్థులకు చేపడుతున్న రిలే నిరాహార దీక్షల బుధవారం నాటికి 14వ రోజుకి చేరింది. నెలవంక గ్రామానికి చెందిన కుల పెద్దలు, నిరుద్యోగులు మోకాళ్లపై కూర్చొని నిరసనలు తెలిపారు.

క్రమశిక్షణతో మెలగాలి


మాట్లాడుతున్న ఏఎస్పీ విఠలేశ్వరరావు

గుజరాతీపేట: విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించగలరని ఏఎస్పీ టీపీ విఠలేశ్వరరావు అన్నారు. స్థానిక అర్చరీ అకాడమీలో బుధవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఏఎస్పీ పాల్గొని మాట్లాడారు. చెటికం రాజ్‌కుమార్, జి.వెంకటేశ్వరరావు, పి.గోవిందరావు, కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వికసిత్ భారత్

ఆమదాలవలస: గాజులకొల్లివలస గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ కార్య క్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆయుష్మాన్‌భవ కార్డు ప్రజలందరికి ఉండేలా చూడాలని, ఈ కార్డు వల్ల ప్రయోజనాన్ని వివరించారు. కార్యక్రమంలో ఆర్ఆర్ పంచాయతీ ప్రెసిడెంట్, మండల అధికారులు, మాజీ జడ్పీటీసీ బొడ్డేపల్లి నారాయణరావు, బీజేపీ నాయకులు పేడాడ సూరపునాయుడు, గడ్డెయ్య, గురువల్లి వెంకటరావు, బొడ్డేపల్లి చిన్నబాబు పాల్గొన్నారు.

నకిలీ బెంతు ఒరియాలను ఎస్టీల్లో చేర్చొద్దు


వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

కంచిలి: నకిలీ బెంతు ఒరియాలను ఎస్టీల్లో చేర్చవద్దని ఆల్ ఇండియా ఆదివాసి ఉద్యోగ సంఘ ప్రతినిధులు గణేష్, నిత్యానంద, ప్రసాద్ కుమార్ చైతన్య అన్నారు. బుధవారం కంచిలిలో ఆదివాసి ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నకిలీ బెంతు ఒరియాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు.

మునిసిపల్ కార్మికుల సమ్మె విరమణ

శ్రీకాకుళం క్రైం: మునిసిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ జేఏసీ ఆధ్వర్యంలో గత ఎనిమిది రోజులుగా చేపట్టిన పారిశుధ్య కార్మికుల బుధవారం సాయంత్రం విరమించారు. ప్రభుత్వం చర్యలు సఫలం కావడంతో విరమించినట్టు జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి కల్యాణి తెలిపారు. ఈ సందర్భంగా అప్పలరాజు, జె.గురుమూర్తి, వేణుగోపాల్, పార్థసారధి, శంకర్, రసూల్, రామచంద్ర, తారక, రమణ, కిరణ్ యూనియన్ నాయకులు విజయోత్సవాలు జరుపుకున్నారు. కాగా అంతకుముందు బుధవారం ఉదయం ఇచ్ఛాపురం, ఆమదాలవలస, పలాస మునిసిపాలిటీలతోపాటు శ్రీకాకుళం నగర కార్పొరేషన్‌ల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు నిరసనలు తెలిపారు.

వికాస్ హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు

అరసవల్లి: స్థానిక వికాస్ హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ కూన వేణుగోపాలరావు, కో-డైరెక్టర్ మురళీ, ప్రిన్సిపాల్ నిర్మలాదేవి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సంక్రాంతి సంబరాల గొప్పదనాన్ని ఈ సందర్భంగా వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలతోపాటు కోలాటం, హరిదాసు వేషధారణలు, రంగవల్లులు, భోగీ మంటలతో సందడి చేశారు.

టీడీపీ నేతల హర్షం

సరుబుజ్జిలి: టీడీపీ అధినేత చంద్రబాబుకు బుధవారం హైకోర్టు ముందస్తు బెయిల్ ఇవ్వడంతో చంద్రబాబు సతీమణి భువనేశ్వరి చేపట్టిన న్యాయం గెలవాలనే నినాదం నెరవేరిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శివ్వాల సూర్యనారాయణ అన్నారు. బుధవారం సరుబుజ్జిలిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సైకో జగన్‌రెడ్డి చంద్రబాబుపై ఇన్నర్ రింగ్‌రోడ్డు, మద్యం, ఇసుక వ్యవహారాల్లో అక్రమాలు జరిగాయంటూ ఏపీ సీఐడీతో పెట్టించిన అక్రమ కేసుల్లో హైకోర్టు ముందుస్తు బెయిల్ మంజూరు చేయడం హర్షణీయమన్నారు. స్కిల్‌స్కామ్ కేసులో చంద్రబాబును అక్రమ అరెస్టు చేసి జైల్లో పెట్టిన ఘటన తట్టుకోలేక ఎంతో మంది పార్టీ కార్యకర్తలు, నాయకులు మరనించారన్నారు. దీనిపై స్పందించిన భువనేశ్వరి నిజం గెలవాలి అంటూ ఆయా కుటుంబాలను పరామర్శించి సాయాన్ని అందించారన్నారు. కక్ష సాధింపులతో పాలన సాగిస్తున్న జగన్‌రెడ్డికి న్యాయస్థానాలు అక్షింతలు వేసినా బుద్ధిమారడం లేదన్నారు. సమావేశంలో తూర్పుకాపు సాధికార జిల్లా అధ్యక్షుడు పల్లి సురేష్, పార్టీ మండల అధ్యక్షుడు అంబళ్ల రాంబాబు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నందివాడ గోవిందరావు, పార్టీ నాయకులు దవళ సింహాచలం, కూన సంజీవరావు, మీసాల రామారావు, కందుల వెంకటరావు, లావేటి పూర్ణారావు, కొర్ను సూర్యనారాయణ ఉన్నారు.

దరఖాస్తుకు గడువు పెంపు

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ఆఫర్ చేస్తున్న ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) కోర్సులో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణకు గడువును ఈ నెల 24వ తేదీ వరకు పెంచినట్టు వర్సిటీ రిజిస్ట్రార్ బిడ్డిక అడ్డయ్య తెలిపారు. ఈ కోర్సు సిలబస్, అర్హతలు తదితర వివరాలు వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపర్చామని చెప్పారు. రూ.250 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు.

క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్

ఇచ్ఛాపురం: క్రీడాకారులతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ అన్నారు. బుధవారం సురంగి రాజా మైదానంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్‌తోపాటు కమిషనర్ ఎన్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాసశివ రాత్రి పూజలు



శ్రీకాకుళం కల్చరల్: మాసశివ రాత్రి సందర్భంగా బుధవారం నక్కవీధిలోని ఉమాజఠలేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు, పూజలు అర్చకులు బి.అశ్వనీకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేపట్టారు. అలాగే నాగావళి నదీతీరంలో ఉన్న ఉమారుద్ర కోటేశ్వరాలయంలో అర్చకులు రాంజీ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

నేడు మండల సమావేశం

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం మండల పరిషత్ సమావేశం గురువారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ బోర పుష్ప అధ్యక్షతన నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు పూర్తి సమాచారంతో రావాలని, ప్రజాప్రతినిధులంతా హాజరు కావాలని కోరారు.

ఆదివాసీ ఉద్యోగ సంఘ కార్యవర్గం

కంచిలి: ఆదివాసీ ఉద్యోగ ఫెడరేషన్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నికున్నారు. బుధవారం కంచిలి మార్కెట్ యార్డులో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సవర జగన్నాయకులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా రైకా మోహన్, ఉపాధ్యక్షుడిగా బెన్నుమాకో బడై, ప్రధాన కార్యదర్శిగా పితాంబరం శనాపతి, కోశాధికారిగా డొంబురు దొళాయి, బసంతో ప్రధాన్, గౌరవ అధ్యక్షుడిగా హరిబందు జన్ని, కార్యదర్శులుగా గణేష్ గోమాంగో, రాజేశ్వరి దొళై, పండవ బిసాయి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కార్యవర్గాన్ని అభినందించారు.

30 రోజులుగా..

● కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన

సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన నిరసన బుధవారం నాటికి 30వ రోజుకు చేరింది. తన న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యమాన్ని ప్రభుత్వం అనచాలని చూస్తోందని, అయినా వెనక్కి తగ్గే ప్రసక్తి లేదన్నారు. హక్కులు అడిగితే అణగదొక్కాలని చూస్తున్న జగన్‌కు వచ్చే ఎన్నికల్లో గట్టి గుణపాఠం తప్పదని హెచ్చరిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి బృందం


ఇచ్ఛాపురం: దండాలు పెడుతూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


పొందూరు: దీక్షలో పాల్గొన్న అంగన్‌వాడీ సిబ్బంది



నరసన్నపేట ఎంపీడీవో కార్యాలయం వద్ద..


పలాస రూరల్: కాశీబుగ్గ ఐసీడీఎస్ ప్రాజెక్టు వద్ద..


కోటబొమ్మాళి: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు..


ఆమదాలవలస: నిరసన తెలుపుతూ..


టెక్కలి రూరల్: టెక్కలిలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ సిబ్బంది


జలుమూరు: సారవకోట తహసీల్దార్ కార్యాలయం ఎదుట..

బీసీలను ఆదరించింది టీడీపీయే

● 'జయహో బీసీ'లో గౌతు శిరీష

పలాసరూరల్: బీసీలను ఆదరించి రాజ్యాధికారం కల్పించిన ఘనత టీడీపీదేనని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. కొత్తూరు గ్రామంలో బుధవారం 'జయహో బీసీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీసీలకు అండగా నిలిచి వారికి ఎన్నో పదవులిచ్చి గౌరవించిన వ్యక్తి ఎన్టీఆర్ అని, ఆ తరువాత చంద్రబాబు పాలనలో బీసీలకు ఆదరణ వంటి పథకాలను అమలు చేసి వారిని ఆదుకున్నారన్నారు. ప్రస్తుతం వైసీపీ పాలనలో బీసీలకు అన్యాయం జరుగుతోందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించి రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. టీడీపీ, జనసేన నాయకులు బీసీల అభ్యున్నతి, బీసీలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కార మార్గాలపై మాట్లాడారు. అనంతరం శిరీష ఆధ్వర్యంలో తర్లాకోట పంచాయతీకి చెందిన పలువురు వైసీపీ నుంచి టీడీపీ పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి వజ్జ బాబూరావు, నాయకులు పీరికట్ల విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణరావు, నియోజక వర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి, వి.హేమకుమార్, జనసేన నాయకులు సంతోష్‌పండా, వసంత్, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.



పలాసరూరల్: 'జయహో బీసీ' కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, టీడీపీ నాయకులు

టీడీపీతోనే యువతకు భవిష్యత్

జలుమూరు: టీడీపీ అధినేత చంద్రబాబు ఆధ్వర్యంలోనే యువతకు ఉజ్వల భవిష్యత్ సాధ్యమని యూనిట్ ఇన్‌చార్జి కొబగాపు ఉత్తరుడు అన్నారు. పర్లాం గ్రామంలో బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ వైఫల్యాలను, టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కాపుతెంబూరులో...

నందిగాం: కాపుతెంబూరులో బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వ హించారు. మండల తెలుగు యువత అధ్యక్షుడు తూలుగు ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో నేతలు కొల్లి హరిబాబు, దోమనాయుడు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి చంద్రబాబు అమలు చేయనున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో భుజంగరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



నందిగాం: కాపుతెంబూరు, జలుమూరు: పర్లాంలో బాబు షూరిటీ కరపత్రాలు అందిస్తున్న నాయకులు

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం విడనాడాలి

● డ్వామా పీడీ చిట్టిరాజు

నరసన్నపేట: గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం విడనాడాలని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. వేతనదారులతో ప్రభుత్వ నిబంధనల మేరకు పనులు చేయించాలన్నారు. పని సమయంలో కాలక్షేపం చేస్తు న్నట్టు ఫిర్యాదులు వస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మస్టర్లు వేయడంలో ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గుర్తించామన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి లవరాజు, ఎంపీపీ ఆరంగి మురళి, ఎంపీడీవో మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

ఉత్సాహంగా జాతీయ టెన్నికాయిట్ పోటీలు



తలపడుతున్న టెన్నికాయిట్ క్రీడాకారులు

పలాస: జాతీయ టెన్నికాయిట్ పోటీలు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఉత్సాహంగా జరుగుతున్నాయి. బుధవారం రెండోరోజు మహిళల విభాగంలో ఒడిశా-హర్యానా జట్లు తలపడ్డాయి. మహారాష్ట్ర-ఢిల్లీ, తెలంగాణ-మధ్యప్రదేశ్, పాండిచ్చేరి-ఛత్తీస్‌ఘడ్, ఆంధ్రప్రదేశ్- గుజరాత్, జార్ఖండ్-అస్సాం, తమిళనాడు-జమ్ము కాశ్మీర్ జట్లు తలపడ్డాయి. రెండో రౌండ్ పోటీలు గురువారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం క్వాలీఫై రౌండ్ పోటీలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమాన్ని రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ కోశాధికారి పి.తవిటయ్య పర్యవేక్షిస్తున్నారు.

రైల్వే భూసేకరణపై సబ్ కలెక్టర్ చర్చలు

టెక్కలి: మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు సంబంధించి అవసరమైన రైల్వేలైన్ నిర్మాణం కోసం భూ సేకరణ చేసేందుకు గాను సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ బుధవారం సంబంధిత రైతులతో సమావేశం నిర్వహించారు. అయితే పలువురు రైతులు ఈ స్థలాలు కాకుండా వేరే రూటును పరిశీలించాలని కోరగా మరికొందరు ఎకరాకు రూ.45 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో

వజ్రపుకొత్తూరు: మండలంలోని 43 పోలింగ్ కేంద్రాలను పలాస ఆర్డీవో భరత్‌నాయక్ బుధవారం తనిఖీ చేశారు. కేంద్రాల్లోని సౌకర్యాలపై ఆరా తీశారు. మెరుగైన సౌకర్యాల కల్పనకు అవసరమైన సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాలపై నివేదికను జిల్లా అధికారులకు అందించ నున్నట్లు తెలిపారు. అనకాపల్లి వద్ద రేషన్ సరుకుల వాహనానిన తనిఖీ చేసి సకాలంలో పంపిణీ చేయాలని సూచించారు. అక్కుపల్లి పీహెచ్‌సీని పరిశీలించి రోగులకు అందిస్తున్న సేవలపై డా.చంద్రశేఖర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.



నువ్వలరేవు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో భరత్‌నాయక్

మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి

● ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు

అరసవల్లి: మాజీ సైనికుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక చొరవ చూపుతానని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. నగరంలోని పెద్దరెల్లి వీధిలో జిల్లా మాజీ సైనికుల సమాఖ్య భవనంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దేశానికి ఎంతో విలువైన సేవలందించి, పదవీ విరమణ చేశాక మాజీ సైనికులు సరైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక కష్టాలు పడుతున్నారన్నారు. వారిని ఆదుకోవాలనే కృత నిశ్చయంతో పార్లమెంట్‌లో మాజీ సైనికోద్యోగుల సమస్యలపై చర్చించా నన్నారు. తన తండ్రి దివంగత ఎర్రన్నాయుడు మాజీ సైనికుల భవనాన్ని మంజూరు చేశారన్నారు. ఆ భవనంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటా నన్నారు. సమావేశంలో మాజీ సైనికుల సమాఖ్య జిల్లా చైర్మన్ పి.ఈశ్వరరావు, అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు, కల్నల్ ఎం.నారాయణరావు, తమ్మినేని కృష్ణారావు, బర్రి సంజీవరావు, టి.జనార్దనరావు, తర్ర కృష్ణారావు, ఎస్.రామకృష్ణ, కె.కన్నారావు, ఎస్ఎల్ రావు, పి.విశ్వేశ్వర రావు, బి.ఈశ్వరప్రసాద్, సింహాచలం, పద్మావతి, జగ్గమ్మ, అమ్మన్నమ్మ, అరసవల్లి లక్ష్మి, పైడి భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు

సందేశాత్మక రచనలు చేయాలి: జేసీ



అప్పలనాయుడును సత్కరిస్తున్న జేసీ నవీన్ తదితరులు

శ్రీకాకుళం కల్చరల్: రచయితలు సందేశాత్మక రచనలు చేయాలని జాయింట్ కలెక్టర్ నవీన్ అన్నారు. సాహితీ స్రవంతి కన్వీనర్ కేతిరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంక్రాంతి జన కవనాలు పేరిట కవిసమ్మేళనం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 30 మంది కవులు తమ రచనలను చదివి వినిపించారు. అనంతరం ఇటీవల వైఎస్ఆర్ జీవిత సాఫల్య పురస్కారం అందుకున్న రచయిత అట్టాడ అప్పల నాయుడును సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్ రాజు, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం ప్రతినిధి వీజీకే మూర్తి, కంచరాన భుజంగరావు, చింతాడ రామారావు తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడి బోధనలు ఆచరణీయం: డీఈవో

శ్రీకాకుళం కల్చరల్: స్వామి వివేకానందుడి బోధనల్లో నైతిక విలువలతో కూడిన సందేశాలు ఉంటాయని, వాటిని యువత ఆచరించాలని డీఈవో కె.వెంకటేశ్వరరావు అన్నారు. ఉపనిషన్మం దిరంలో శారదా రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు ఎం.రామకృష్ణారావు ఆధ్వర్యంలో జాతీయ యువజన ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. యువత వివేకానంద బోధనలు చదవడం వల్ల నిరాశ, నిస్పృహలు దూరమవుతాయన్నారు. ఈ సందర్భంగా స్వామి వివేకానందుడి చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మందిరం ప్రతినిధులు పతంజలి శాస్త్రి, ఎన్.నర్సింహ మూర్తి, కనకల సత్యం, రమణ, డి.ఈశ్వరరావు, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.



వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఘనంగా హిందీ దివస్

ఇచ్ఛాపురం రూరల్: డొంకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయులు సీహెచ్ వెంకటరమణ ఆధ్వర్యంలో హిందీ దివస్‌ను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 9, 10 విద్యార్థులకు జాతీయ భాష హిందీ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం సరోజిని, ఉపాధ్యాయులు డి.లోకేష్ కుమార్, సూర్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు వస్త్రాలు పంపిణీ

హిరమండలం: స్థానిక ప్రేమసాయి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శ్రీకాకుళం గ్రేస్ హెల్పింగ్ హాండ్స్ ప్రతినిధులు బుధవారం నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యుడు వైవీ రమణ మాట్లాడుతూ.. తన మిత్ర బృందం ద్వారా ఆశ్రమంలోని వృద్ధులకు మూడేళ్లుగా వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే దాశెట్టి హేమ రూ.20 వేలు విలువ చేసే కిరాణా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో పాలకొండ రమణ, కవిటి విజయలక్ష్మి, కోరాడ సోమేశ్వరరావు, పి.అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..!

● దుర్గంధంతో ఇబ్బందులుపడుతున్న ప్రజలు
● శాశ్వత కార్మికులతో నామమాత్రపు పనులు
● శివారు ప్రాంతాల్లో సమస్య తీవ్రం

పలాస: పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు గడచిన 16 రోజులుగా చేపట్టిన నిరవధిక సమ్మె నేపథ్యంలో పట్టణంలో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి, కాలువలు నిండి పోయి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా శివారు ప్రాంతాలతో పాటు పలు గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు పెరుగుతుండడంతో అధికారులు శాశ్వత ప్రాతి పదికన ఉన్న పారిశుధ్య కార్మికులతో అక్కడక్కడ, ప్రధాన మార్గాల్లో పనులు చేయిస్తున్నప్పటికీ ఫలితం కనిపించడం లేదు. దీంతో దోమలు స్వైరవిహారం చేస్తుండగా మురికివాడల్లో చర్మసంబంధిత రోగాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ, ఆమదాలవలస మునిసిపాలిటీలతో పాటు శ్రీకాకుళం కార్పొరేషన్ ఉన్నాయి. శాశ్వత సిబ్బందితో తూతూ మంత్రంగా చెత్తను తొలగిస్తున్నారు. అదీ ప్రధాన మార్గాలు, హోటళ్ల నుంచి మాత్రమే చెత్తను సేకరిస్తుండడంతో సమస్య రోజురోజుకూ జఠిలం అవుతోంది. ప్రధానంగా పలాస-కాశీబుగ్గ పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. శాశ్వత సిబ్బంది పనులు చేపడుతున్నప్పటికీ ఫలితం కనిపించడం లేదు. ఏ వార్డు చూసినా చెత్త కుప్పలు, మురుగు కాలువల్లో సిల్ట్ పేరుకుపోయి దర్శనమిస్తున్నాయి. దీనికి తోడు పశువులు, కుక్కల కారణంగా చెత్తంతా రోడ్లపై చెల్లా చెదురుగా అయి పోతుం డడంతో ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మురికివాడల్లోని ప్రజలు పారిశుధ్య సమస్యలతో ఇక్కట్లకు గురవుతున్నారు. గడచిన కొన్నిరోజులుగా ఇదే పరిస్థితి నెలకొంటోంది. దుర్గంధం వల్ల అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని పలు వార్డుల ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్య సమస్యలను తక్షణం పరిష్కరించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని పలువురు పట్టణ వాసులు కోరుతున్నారు.



సత్యసాయిమందిరం వీధిలో ఇలా...



లేబర్ కాలనీలో రోడ్డుపైన చెత్త

తప్పని నిరీక్షణ



మిల్లుల బయట బారులు తీరిన ధాన్యం ట్రాక్టర్లు



నందిగాం: వే బ్రిడ్జి వద్ద నిలిచిన ధాన్యం లోడ్లు

పలాసరూరల్: ఆరుగాలం శ్రమించి పండించిన పంటను మిల్లులకు తరలించేందుకు రైతులు నానా కష్టాలు పడుతున్నారు. పంటలను నూర్పు చేసి ట్రాక్టర్లతో మిల్లులకు తరలించేందుకు అనేక ఆటంకాలతో ఇబ్బందులు పడుతున్నారు. ఆర్బీకేల ద్వారా పంటను తరలించేందుకు జీపీఎస్ చేసే సమయంలో సాంకేతిక లోపాలతో ఆలస్యం జరుగుతోంది. పలాస మండలం నుంచి వచ్చిన ట్రాక్టర్లు బుధవారం మిల్లుల వద్ద బారులు తీరారు. ఉదయం నుంచి రాత్రి వరకు వారికి నెంబర్లు రాకపోవడంతో రాత్రి రోడ్లపైనే ధాన్యం బస్తాలతో నిరీక్షించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. దీంతో ట్రాక్టర్లకు అదనపు మొత్తం చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాలకు చెందిన రైతులు కోరుతున్నారు.

రెండోరోజూ...

నందిగాం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు ట్రక్ షీట్ల కోసం రెండోరోజు నిరీక్షిం చాల్సి వచ్చింది. మండలంలోని పలు మిల్లులకు బ్యాంక్ గ్యారెంటీలు లేకపోవడంతో ట్రక్ షీట్ ప్రక్రియ సాగలేదు. బుధవారం ఉదయం జరుగుతుందన్న ఆశతో నిరీక్షించినా సాయంత్రం వరకు జరగక పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొ న్నారు. పలు గ్రామాల నుంచి వచ్చిన వాహనదారులు, రైతులు నిరాశ, నిస్పృహలతో ఇంటిబాట పట్టారు.

పాతపట్నం సీఐగా నల్లి సాయి



పాతపట్నం, జనవరి 10: పాతపట్నం సీఐగా నల్లి సాయి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన వినోద్‌బాబు అనకాపల్లి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విశాఖ సిటీ నుంచి సాయి ఇక్కడికి వచ్చారు. ఎస్ఐ మహమ్మద్ యాశిన్, సిబ్బంది అభినందించారు.

16వ రోజూ కొనసాగిన సమ్మె

కాశీబుగ్గ: సమస్యలు పరిష్కరించాలని కోరు కుంటూ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె 16వ రోజు బుధవారం కొనసాగింది. సీఎం జగన్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గణపతి, శ్రీనివాసరావు, పారిశుధ్య కార్మిక సంఘం నేతలు మురుగన్, రవి, దివాకర్, శంకర్, ముఖి, సీతమ్మ, గులాబీ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ కుటుంబానికి పరామర్శ

పలాస: మాజీ కౌన్సిలర్ గాలి చెంచమ్మ మృతికి టీడీపీ నాయకుడు యార్లగడ్డ వెంకన్న చౌదరి సంతాపం తెలిపారు. బుధవారం ఆమె కుమారుడు, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావును కలిసి పరామర్శించారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, కార్యదర్శి సప్ప నవీన్ ఉన్నారు. ● **వజ్రపుకొత్తూరు:** పెద్దబొడ్డపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు దుంపల ముఖలింగం, వల్లభరావు తల్లి నానెమ్మ మృతి చెందడంతో ఆమె కుటుంబానికి టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష బుధవారం పరామర్శించారు. నాయకులు వజ్జ బాబూరావు, అర్స వెల్లి ఉమా, సూరాడ మోహనరావు పాల్గొన్నారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌టెన్నిస్‌కు తేజ ఎంపిక



పాతపట్నం: మధ్యప్రదేశ్ రాష్ట్రం దేవాస్‌లో ఈనెల 13 నుంచి 17వ తేదీ వర కు జరగనున్న జాతీయస్థాయి సాఫ్ట్ టెన్నిస్ టోర్నమెంట్‌కు స్థానిక మోడల్ డిగ్రీ కళాశాల విద్యార్థి గురాడి తేజ ఎంపికైనట్లు జిల్లా సంఘం అధ్యక్షుడు గురాడి అప్పన్న తెలిపారు. గతనెల 16, 17 తేదీల్లో గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా తేజను పలువురు పీడీలు, పీఈటీలు అభినందించారు.

అందరి సహకారంతోనే గ్రామాల అభివృద్ధి

జలుమూరు: అందరి సహకారంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ వాన గోపి అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ.. ప్రతిపక్షాలు సహకరించిననాడే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, వైస్ ఎంపీపీలు తంగి మురళీకృష్ణ, డోల నాగరత్నం, ఎంపీడీవో ఎ.దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

కంబకాయలో గడపగడపకు..

నరసన్నపేట: ప్రజల అభివృద్ధే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. బుధవారం కంబకాయిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదనరావు, ఎంపీపీ మురళి, సర్పంచ్‌లు పాల్గొన్నారు. అనంతరం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను ఎమ్మెల్యే కృష్ణదాస్ ప్రారంభించారు.

కుష్ఠు వ్యాధిగ్రస్థులకు చెప్పుల పంపిణీ

పోలాకి: కుష్ఠువ్యాధిగ్రస్థులకు మైక్రో సెల్యూలర్ చెప్పులు ఉచితంగా అందజేస్తున్నామని పోలాకి పీహెచ్‌సీ వైద్యాధికారి డా.శ్రీనాథ్ తెలిపారు. బుధవారం పీహెచ్‌సీలో అనుమానిత కుష్ఠు వ్యాధి కేసులకు స్క్రీనింగ్ చేపట్టారు. కార్యక్రమంలో డెప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ వాన సురేష్‌కుమార్, ఆరోగ్య విస్తరణాధికారి నల్లి రవికుమార్, పర్యవేక్షకులు శేఖర్, బంటుపల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

'వైసీపీ హయాంలో బీసీల అణచివేత'

పోలాకి: వైసీపీ ప్రభుత్వం బీసీ వర్గాలను అణచివేసిందని బీసీ సంఘం, టీడీపీ నాయకులు అన్నారు. బుధవారం శిష్టకరణాలు, నగరాలతో సమావేశం నిర్వహించారు. నగరాలు, శిష్టకరణాలు బీసీ వర్గాలుగా ఉన్నప్పటికీ సరైన గుర్తింపు లేదన్నారు. రానున్న ఎన్నికల్లో సంఘటితంగా టీడీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో శిష్టకరణ సంఘం నాయకులు సదాశివుని రాంబాబు, కుప్పిలి వెంకటరమణ, వెంకటరావు, నగరాల సంఘం నాయకులు నల్లాన వెంకునాయుడు, గిరిధర్, టీడీపీ నాయకులు మైలపల్లి త్రినాథ్, కొమర ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన శిష్టకరణ, నగరాల సంఘ నేతలు

పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపొందించాలి

పాతపట్నం: ఓటర్ల జాబి తాలలో చేర్పులు, తొలగింపులు పారదర్శకంగా చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఈఆర్వో, జడ్పీ సీఈవో ఆర్. వెంకట్రామన్ బుధవారం రాజ కీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలమట మాట్లాడుతూ.. పార్టీల కతీతంగా అధికారులు వ్యవహరించాలన్నారు. బూత్ లెవెల్‌లో గతంలో ఇచ్చిన సమస్యలను పరిష్కరించాలని కోరారు.



బీజేపీ బలోపేతానికి కృషి

ఎల్.ఎన్.పేట: జిల్లాలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ అధికార ప్రతినిధిగా నియమి తులైన వి.సోమేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నెరవేరుస్తానన్నారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ

టెక్కలి: అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను బుధవారం టెక్కలిలో ఇంటింటికీ పంపిణీ చేశారు. స్థానిక ఎన్టీఆర్ కాలనీలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో అక్షింతలను ఊరేగించి అందించారు. బీజేపీ నేత హనుమంతు ఉదయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.